
# తెలుగువాణి

27వ వార్షిక సంచిక



నవంబర్ 2017 తెలుగు సాంస్కృతిక సంఘం, ఆస్టిన్ Vol. 27 No.1


PSG INVESTMENTS
Your Real Estate Investment Experts
A Central Metro Realty
GIBY PARACKAL
Investor / Realtor®
512 653 6525
INVESTMENT / COMMERCIAL / RESIDENTIAL / PROPERTY MGMT / MORTGAGE
WE SPECIALIZED IN
Texas Income Properties
Farm/Ranch/Acreage/Lots
REO/Foreclosures/HUD/Short Sales
Planning/Zoning Laws
Leasing/Property Mgmt
BUY/SELL in INDIA
$999 Flat Fee*
OR
up to 3% cash Back*
on New Homes
Poor N Needy patients get 5% of our profit from Your Referal !!
Churchs,Non-profits get 5% of our profit from Your Business!!
*Certian Conditions Apply
12702 SHERBOURNE ST #B, AUSTIN, TX 78729
EMAIL: GIBY@PSGINVESTMENTS.COM
WWW.PSGINVESTMENTS.COM
Sponsor Broker Lic. # 588680

# తెలుగువాణి

## 27వ వార్షిక సంచిక

Vol. 27 No. 1

సంపాదకవర్గం :

**శ్రీ మహేష్ కారంగుల**

**శ్రీ సంగమేశ్వర్ రెడ్డిగారి**

**శ్రీ వెంకట్ శివానందరెడ్డి నామాల**

ముఖచిత్రం :

**శ్రీ మహేష్ కారంగుల**

website : www.austintelugu.org

facebook : https://www.facebook.com/teluguculturalassociationaustin

Telugu Cultural Association, Austin

తెలుగు సాంస్కృతిక సంఘం, ఆస్టిన్

మీరు మెచ్చిన, మీకు నచ్చిన సాంస్కృతిక సంఘం - సభ్యులుగా చేరండి, చేర్పించండి

# LEADERSHIP TEAM



**Venkat Shiva Namala**
President



**Venkat Gotham**
Secretary



**Venkatram Reddy Vumma**
Treasurer



**Ram H Malli Reddy**
Cultural & Event Management




**Vishu Kandi**
Membership & Technology



**Sriram Bokkisam**
Finance & Sponsorship



**Brahmendra Lakku**
Logistics & Food



**Jaipal Reddy Sivaiah**
Board of Director



**Sangameshwar ReddyGari**
Board of Director



**Ravi Burujula**
Board of Director

# సంపాదకీయం

**ఏడు** సముద్రాలు దాటి, అవని అటునుంచి ఇటు వచ్చిన మనందరినీ అక్కున, ఒక పంచన చేరేట్టు చేసి, విడిచి వచ్చిన ఇంటి బాధను మరచేలా ఈ వసుదైక కుటుంబంలో మనకంటూ ఒక అస్తిత్వాన్ని ఏర్పరిచింది మన తెలుగు భాష. అటువంటి కమ్మని భాషకు మరియు భాషాభిమానులందరికీ కూడా నా హృదయపూర్వక నమస్కారములు.

*తేనెలొలికే భాష తెలుగు*
*అమ్మదనం నిండిన కమ్మనైన భాష తెలుగు*
*యాబదిఆరక్షరాల రత్నమాల తెలుగు*
*ఏ దేశమేగినా నీ ఆత్మబంధువు తెలుగు.*

ఆస్టిన్ నగరంలో తెలుగుభాషకు 26 సం॥లు, తెలుగు తనానికి 26 సం॥లు, తెలుగోడి మనుగడకి 26 సం॥లు, తెలుగు సాంస్కృతిక సంఘానికి 26 సం॥లు. ఈ 26 సంవత్సరాలుగా తెలుగు భాష మరియు సంస్కృతి, సాంప్రదాయాలను టెక్సాస్ రాజధానిలో వెలుగొందేలా పాటుపడిన ప్రతీ ఒక్కరికీ ఈ తెలుగువాణి పత్రికను మనస్ఫూర్తిగా అంకితం చేస్తున్నాను.

తెలుగును సాధారణంగా ఒకదానితో ఒకటి కలిసి చేరిపోయే భాషగా గుర్తిస్తారు. ఇందులో ఒక నామవాచకానికి దాని ఉపయోగాన్ని బట్టి ప్రత్యేకమైన అక్షరాలు చేర్చబడతాయి. అలాగే మన తెలుగు సంస్కృతి మరియు సాంప్రదాయాలు కూడా అందరిని కలుపుకుపోయే విధంగానే ఉంటాయి. ఇలాంటి భాష, అలాంటి సాంప్రదాయాలు కలిగిన మనం ఒక తల్లి బిడ్డలుగా వుంటూ మన తరువాతి తరాలవారికి మన భాషను పొందుపరచి సంస్కృతి, సాంప్రదాయాలతో కలగలిపి పరిపూర్ణంగా అందించటానికి అందరమూ ప్రయత్నించాలి.

సప్త సముద్రాలు దాటివచ్చినా, మన తెలుగు భాషను, తెలుగు భాషా వైభవాన్ని నిత్యం గుర్తుంచుకోవాలనే తాపత్రయమే నన్ను ఈ సాహసానికి పురిగొల్పింది. ఇందులో ఎంత కృతకృత్యుడయ్యానో చెప్పడానికి మీరే న్యాయనిర్ణేతలు. మీరందరూ ఈ రచనలన్నిటినీ చదివి, ఆనందించి, మీ ఆలోచనలను అక్షర రూపంలో పెడతారని, రాబోయే తెలుగువాణి సంచికల కోసం ఎదురుచూస్తారని, ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ....

మీ
**మహేష్ కారంగుల**



*తెలుగు తెలుగు! జై తెలుగు వెలుగు!!*

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అధ్యక్షుడి సందేశం | 5 |
| 2. | తెలుగుతల్లికి నీరాజనాలు!! | 6 |
| 3. | అష్టదిగ్గజాలు | 7 |
| 4. | పద్య కవితలు | 9 |
| 5. | అమెరికన్ సిటిజెన్ | 10 |
| 6. | జై త్రిలింగ దివ్య ధాత్రి! జై మహాంధ్ర మాతృమూర్తి! జయజననీ! జయజననీ! | 12 |
| 7. | ఈరోజే కొత్తగా, ఏ రాగమో... | 13 |
| 8. | మౌంటైన్ అద్దమందు కొంచెమై ఉండదా? | 15 |
| 9. | ఓ ప్రియా, మల్లెల మాసం, మంచిమాటలు | 16 |
| 10. | చివరి ప్రయాణంలోగా, విషాద వలయం | 18 |
| 11. | శ్రీనాథుడి పల్నాటి వర్ణన పద్యాలు | 19 |
| 12. | శిశిరమూ–సోయగమూ, తెర, పొడుపు పద్యాలు | 21 |
| 13. | నావల్ల నేనూ | 22 |
| 14. | శ్రీనాథుడు శ్రీకృష్ణుడికి విసిరిన సవాలు / ఛాలెంజ్! | 23 |
| 15. | కవిత్వం, సుమతీ శతకాలు | 24 |
| 16. | సరదా కవిత్వం – పరాచికాలు | 26 |
| 17. | తుంగభద్రానది మీద ఓ అందమైన పద్యం | 27 |
| 18. | మనసుపాట, ఆమె | 28 |
| 19. | TCA – 2017 చిత్రాలు | 30 |
| 20. | TCA – రజతోత్సవ చిత్రాలు | 38 |

# అధ్యక్షుడి సందేశం

ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు!

తెలుగు కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ ఆస్టిన్ (TCA)కు స్వాగతం.

అందరికీ దీపావళి మరియు దసరా శుభాకాంక్షలు. ఆస్టిన్, పరిసర ప్రాంతంలో వున్న తెలుగువారి సేవలో 26 సంవత్సరాలుగా సేవలని అందిస్తున్న సంస్థ తెలుగు కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ ఆస్టిన్ (TCA). ఇంత గొప్ప సంస్థకు గత 3 సంవత్సరాలుగా మన తెలుగు సాంస్కృతిక సంఘం కోసం పనిచేయడానికి మరియు సంస్థ నాయకత్వం వహించటానికి అవకాశం ఇచ్చినందుకు TCA బోర్డ్ మరియు సభ్యులకు ధన్యవాదాలు మరియు హృదయపూర్వక కృతజ్ఞతలు. మా వాలంటీర్లు మరియు స్పాన్సర్లుకు కృతజ్ఞతలు.

ఏ దేశమేగినా ఎందుకాలెడినా ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలపరా నీ జాతి నిండు గౌరవము.

ఆస్టిన్ ప్రాంత తెలుగువారినందరిని ఒక్కతాటిపై తీసుకువచ్చే ఉద్దేశంతో మరియు తెలుగుబాషా, సంస్కృతి మరియు సేవే పునాదులుగా ఈ తెలుగు సాంస్కృతిక సంఘం స్థాపించడమైనది. సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి, బతుకమ్మ, దసరా, దీపావళి వంటి సంస్కృతులను ప్రోత్సహించడానికి మన పండుగలను జరుపుకునే సంఘటనలు మరియు కార్యక్రమాల వైపు మన కార్యనిర్వాహక సంఘం కృషిచేస్తోంది. క్రీడల కార్యక్రమాలు, పిక్నిక్లు, ఇండియన్ స్వాతంత్ర్యదినోత్సవం, దాతృత్వ కార్యక్రమాల వంటివి మేము ముందుకు వస్తాము.

మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడానికి కొత్త కొత్త ఆలోచనలతో ముందుకువచ్చే వారందరికీ నా హృదయపూర్వక స్వాగతం. వీటిని ఆస్టిన్ తెలుగువారికి అందించడానికి మీ సలహా మరియు సహకారాలు కోరుతూ TCA నిర్వాహక సంఘటనలు వాటిని విజయవంతం చేస్తూ వాటిని ముందుకు తీసుకువెళ్ళవలసిందిగా నా ప్రార్థన.

మీ అందరి సహకారాన్ని కోరుతూ,



మీ విధేయుడు

**వెంకట్ శివానందరెడ్డి నామాల**

అధ్యక్షుడు, తెలుగు సాంస్కృతిక సంఘం 2017

పాట

# తెలుగు తల్లికి నీరాజనాలు!!

- డా॥ అహోబిల వర్ఝుల మురళీకృష్ణ

కళల కాణాచి మా తెలుగు తల్లికి!
మధుర గానాల నీరాజనాలు!!
వినుతికెక్కిన మా తెలుగు జాతికి!
వాద్యగీతాల సుస్వాగతాలు!! ॥ కళల కాణాచి మా తెలుగు తల్లికి ॥

శాతవాహన సామ్రాజ్య శోభలు !
కృష్ణరాయల భువనైక విజయాలు!!
కాకతీయుల కదనేతిహాసాలు!
తెలుగు ప్రతిభకు జయజయ ధ్వానాలు!! ॥ కళల కాణాచి మా తెలుగు తల్లికి ॥

నన్నె చోడుడు, నన్నయలు దీవింప!
ఉభయకవిమిత్రు లేతెంచి పాలింప!!
పెద్దనార్యులు, పోతనలు పోషింప!
తెలుగు సాహిత్య క్షేత్రమ్ము పండింది!! ॥ కళల కాణాచి మా తెలుగు తల్లికి ॥

కృష్ణ గోదావరీ నదుల, గలగలలు!
ఏడుకొండలు, శ్రీశైల శిఖరాలు!!
త్యాగబ్రహ్మల సంగీత మధురిమలు!
తెలుగు తల్లికి అపురూప హారాలు!! ॥ కళల కాణాచి మా తెలుగు తల్లికి ॥

కళల కాణాచి మా తెలుగు తల్లికి!
మధుర గానాల నీరాజనాలు!!
వినుతికెక్కిన మా తెలుగు జాతికి!
వాద్యగీతాల సుస్వాగతాలు!! ॥ కళల కాణాచి మా తెలుగు తల్లికి ॥

# అష్టదిగ్గజాలు

సమకూర్చినది : మహేష్ కారంగుల

**విజయనగరాధీసుడైన శ్రీకృష్ణదేవరాయిలవారి ఆస్థానంలో వున్న 8 మంది కవులను అష్టదిగ్గజములు అని పిలిచేవారు. స్వతహాగా సాహితీ ప్రియుడైన రాయుల ఆస్థాన సభకు భువన విజయం అని పేరు. ఈ కవులు రచించిన అనేక రచనలు చాలా ప్రసిద్ధి చెందినవి. వీరి కాలంను ప్రబందయిగంగా పిలుస్తారు. వారు :**

## 1. అల్లసాని పెద్దన -

అష్ట దిగ్గజములలో ఒకడైన అల్లసాని పెద్దన తెలుగులో ప్రబంద రచనలకు ఆధ్యుడు. పెద్దన రచించిన మనుచరిత్ర తొలితెలుగు ప్రబంధంగా గుర్తింపు పొందింది. ఇతడు మంచి కవియేగాక రాజ్య వ్యవహారములు నిర్వహించుటలో దిట్ట అందుకే రాయిల కాలంలో పెద్దనామాత్యుడులని పిలిచేవారు. పెద్దనకు ఆంధ్రకవితా పితామహుడనే బిరుదు కలదు.

రచనలు – మనుచరిత్ర (స్వారోచిష మనుసంభవము), హరికథా సారము, రామస్తవరాజము, అద్వైత సిద్ధాంతము.

## 2. నంది తిమ్మన -

నంది తిమ్మన తన రచనలను కేవలం పండిత భాషలోనే కాక సాధారణ ప్రజలకు అర్ధమయ్యే భాషలో తన రచనలను చేశాడు. అందుకే ముక్కు తిమ్మన ముద్దు పలుకుల అంటారు. నంది తిమ్మన యొక్క ముక్కు పెద్దదిగా ఉండటం వల్ల మరియు ఇతడి రచనలలో ముక్కుపై వర్ణనలు ఎక్కువగా ఉండటం వల్ల ముక్కు తిమ్మన అని పిలిచేవారు. తిమ్మన రచించిన శృంగారకావ్యం పారిజాతాపహరణం ప్రసిద్ధి పొందింది. ఇతడు రాయల వివాహ సమయంలో రాయుల భార్య తిరుమలదేవికి అరణంగా (వివాహ సమయంలో ఇచ్చే కానుక) వచ్చాడు.

రచనలు – పారిజాతాపహరణం, వాణీ విలాసం

## 3. దూర్జటి -

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ఒకడైన దూర్జటి కవి కాళహస్తీస్వర స్వామి యొక్క భక్తుడు. కాళహస్తీస్వరునిపై కావ్యాలు రచించాడు.

రచనలు – కాళహస్తీస్వర శతకం, కాళహస్తీస్వర మహత్యం

## 4. తెనాలి రామకృష్ణుడు -

అష్టదిగ్గజాల్లో వికటకవిగా పేరొందినవాడు తెనాలి రామకృష్ణ కవి. మొదట పామరుడైనా కాళీమాత వర ప్రభావంతో హాస్య కవిగా మంచి పేరు సంపాదించాడు. రామకృష్ణుడి కథలుగా పిలవబడే యుక్తి కథలు తెలుగుజాతిన ప్రతి ఇంటిలోనూ ఇప్పటికీ వినిపిస్తాయి. ఇతడి హాస్య చతురత అమోఘం. రామకృష్ణుడిచే రచించబడిన పాండురంగ మహత్యం ప్రముఖమైనది.

రచనలు – పాండురంగ మహత్యం, ఉద్భటారాజ్య చరిత్ర, ఘటికాచల మహత్యం

### 5. పింగళి సూరన -

తొలి స్వతంత్ర్య తెలుగు కావ్యానికి ఆజ్యుడు. పింగళి సూరన. ఇతడిచే రచించబడిన కళాపూర్ణోదయం అనే నవల ఆసియా ఖండంలోనే మొదటిది. ఇంకా గరుడ పురాణాన్ని తెలుగులోనికి అనువదించాడు.

రచనలు – కళాపూర్ణోదయం, గిరిజా కళ్యాణం, గరుడ పురాణం (అనువాదం), రాఘవ పాండవీయం, ప్రభావతి ప్రధ్యుమ్నం

### 6. రామరాజ భూషణుడు -

రామరాజ భూషణుడు అష్టదిగ్గజాల్లో ఒకడు. ఇతడి అసలు పేరు భట్టు మూర్తి రాయుల అల్లుడి ఆస్థానంలో భూషణంగా (అగ్రగణ్యుడుగా) ఉండటం వల్ల రామరాజు భూషణుడు అనే పేరు వచ్చింది. ఇతడి రచనల్లో వసుచరిత్ర ప్రముఖమైనది.

రచనలు – వసుచరిత్ర, హరిశ్చంద్ర, సరసభూపాలీయము, నలోపాఖ్యానము

### 7. మాదయ్యగారి మల్లన -

అష్టదిగ్గజాల్లో ఒకడైన మల్లన శ్రీకృష్ణదేవరాయుల మంత్రి తిమ్మరుసు మేనల్లుడు. ఇతడు రచించిన రాజశేఖర చరిత్ర నాదెండ్ల అప్పన మంత్రికి అంకితమిచ్చాడు.

రచనలు – రాజశేఖర చరిత్ర

### 8. అయ్యలరాజు రామభద్రుడు -

రామభద్రుడు రాయల ఆస్థానంలో అష్టదిగ్గజాల్లో ఒకడు. ఇతడు రామాభ్యుదయం అనే కావ్యం రచించి గొబ్బూరి నరసరాజుకు అంకితమిచ్చాడు.

రచనలు – రామాభ్యుదయం, సకలకథానుసారము. ✤

KP IndianGrocery

KP Indian Grocery

1212W Parmer Ln, Austin, TX 78727
Phone : 512-833-6222

# పద్మ

## నమస్కృతులు

మాతృదేవతకు మధుపర్కాలు
పితృదేవునకు పీతాంబరాలు
వారిరువురికి మంగళారతులు
వారికే నా తొలి వందనములు

లాలించి పాలించి పెంచిన తాతముత్తవులకు
రాఘవేంద్రస్వామికి నా ప్రథమ గురువునకు
రఘుకుల రామునకు నా ఆరాధ్య దైవమునకు
హస్తములు జోడించి వేడెద వారి ఆశీస్సులకు

నా పతి ప్రాణ రక్షణకు
నా మాంగల్య సురక్షణకు
గురుదైవమైన బాబాకు
మ్రొక్కెద వాని పాదములకు

## బాబా కు

ద్వారకామాయిలో వెలసిన దత్తాత్రేయునకు
చిరకాలము నివసించు షిరిడి వాసునకు
దైవమై మము కాచుచుండు ఆ గురుదేవునకు
అంజలి ఘటించి మ్రొక్కెద ఆ పరమాత్మునకు

బాబా భక్తి భుక్తికి కాదు
బాబా భజన గొప్పకి కాదు
బాబా యే ఒక ప్రపంచం
బాబా యే ఒక విచిత్రం
బాబా యే అతి పవిత్రం
బాబా యే ఒక దైవం
బాబా కి బంధువు లేదు
బాబా కి మతమూ లేదు
బాబా యే స్వర్గానికి సన్మార్గం

## ఓంకారము

ఓంకార జనితమే అక్షరాలు
ఆ అక్షరాలే బ్రహ్మాండాలు
అవియే ఆదిదేవతలు
పలికితే పవిత్ర మంత్రాలు
ఆ ధ్వనులే సాంబుని శంఖనాదాలు
అవే సముద్ర తరంగాలు
వీనులకు వినపడు మేఘ ఘర్జనలు
అక్షరాలే దివ్య సందేశాలు
అవియే ఆనంద అనుభూతులు
సంభాషణలకు మూలకారణాలు
భాషలకు ముత్యాల స్తంభాలు
కవితలకు ముఖ్యమైన వేదికలు
అనురాగాలకు ఆది తాళాలు
సంబంధాలకు సంగీత స్వరాలు
ఆ అనుభూతులే మలయమారుతాలు

## ప్రార్థన

ఉమామహేశ్వరులని సమ్మతించమని
శారదాదేవిని చక్కగా సహకరించమని
లక్ష్మీనారాయణులని నాంది పలుకమని
చేతులెత్తి మ్రొక్కుచుంటి సమస్త దేవతలని

కదలి రమ్మని ఆ శ్రీరామచంద్రుని
ఘంటముతో కనపడమని గణపతిని
వీణతో విచ్చేయమని వాగ్దేవిని
మ్రొక్కె ప్రాతూరి పద్మ కార్య సిద్ధి కని

సకల దేవతలిచ్చారు వారి దీవెనలు
నవ్వుతూ పలకరించారు నవగ్రహాలు
సంతసమున దీవించారు సప్తఋషులు
పుష్పాలు జల్లారు యక్ష కిన్నెర గంధర్వులు

కథ

# అమెరికన్ సిటిజెన్

- ఇర్షాద్ జేమ్స్

ఆదిత్య అమెరికా వచ్చి పదేళ్ళు కావస్తోంది. ఎఫ్-1 వీసా మీద యూనివర్శిటీ ఆఫ్ మిన్నెసోటాకి స్టూడెంట్‌గా వచ్చి అక్కడ మాస్టర్ డిగ్రీ పూర్తిచేశాడు.

ఒక పెద్ద కంపెనీలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం దొరికింది. ఆ కంపెనీవాళ్ళు హెచ్-1బీ వీసా కూడా చేసి పెట్టారు.

కొన్ని సంవత్సరాల తరువాత ఆ కంపెనీ ఆదిత్య కోసం గ్రీన్ కార్డు కూడా అప్లయ్ చేసింది. గ్రీన్ కార్డు వచ్చిన ఐదు సంవత్సరాలకి అమెరికన్ సిటిజెన్‌షిప్ కోసం అప్లయ్ చేశాడు ఆదిత్య.

ఆరోజు ఆదిత్యకి అమెరికన్ సిటిజెన్‌షిప్ ఇంటర్వ్యూ. ఆ ఇంటర్వ్యూ కోసం చాలా రోజుల నుంచి ఎదురు చూస్తున్నాడు. ఇంటర్వ్యూకి ప్రిపేర్ అవ్వడానికి అతని స్నేహితురాలు రమ సహాయం చేస్తానని చెప్పింది.

స్టార్‌బక్స్ కాఫీ షాపులో కూర్చుని పెప్పర్‌మింట్ మోకా తాగుతున్నారు ఆదిత్య, రమ.

రమ చేతిలో కొన్ని కాగితాలు వున్నాయి. వాటిలో అమెరికన్ సిటిజెన్‌షిప్ ఇంటర్వ్యూలో తరచూ అడిగే ప్రశ్నలు, సమాధానాలు వున్నాయి.

"అమెరికన్ కాన్స్‌టిట్యూషన్‌లో మొదటి పది అమెండ్‌మెంట్స్‌ని ఏమని పిలుస్తారు?" అడిగింది రమ.

"బిల్ ఆఫ్ రైట్స్!" చెప్పాడు ఆదిత్య.

"గుడ్. మొత్తం ఎన్ని అమెండ్‌మెంట్స్ వున్నాయి?" అడిగింది రమ.

"ఇరవై ఐదు. నో, వెయిట్, వెయిట్. ఇరవై ఏడు!!" చెప్పాడు ఆదిత్య.

"కరెక్ట్." అని నవ్వింది రమ.

"నెక్స్‌ట్ క్వశ్చన్. యూరోపియన్లు రాకముందు అమెరికాలో ఎవరు వుండేవారు?" అడిగింది రమ.

"ఇండియన్ అమెరికన్స్" చెప్పాడు ఆదిత్య.

"తప్పు!!"

"అమెరికన్ ఇండియన్స్" చెప్పాడు ఆదిత్య.

"అవును. ఇండియన్ అమెరికన్స్ అంటే మనం. అమెరికన్ ఇండియన్స్ అంటే అందరికంటే ముందునుంచి అమెరికాలో వున్నవారు", చెప్పింది రమ.

"ఓకే. నేను సిటిజెన్‌షిప్ ఇంటర్వ్యూకి వెళ్ళే టైం అవుతోంది. తొందరగా ఇంకో క్వెస్చన్ అడుగు", అన్నాడు ఆదిత్య.

"ఓకే. లాస్ట్ క్వెస్చన్. పర్సూట్ ఆఫ్ హేప్పినెస్ అంటే ఏంటి చెప్పు?" అడిగింది రమ.

"ఆ క్వెస్చెన్ అసలు లిస్ట్‌లో లేదే...." అన్నాడు ఆదిత్య.

"లేకపోతేనేం? అయినా చెప్పాల్సిందే!" పట్టుపట్టింది రమ.

"పర్సూట్ ఆఫ్ హేప్పినెస్ అంటే ఆనందాన్ని వెతుక్కోవటం అన్నమాట. కాని అది ఎప్పుడూ, ఎక్కడా, ఎవరికీ దొరికిచావదు. అందుకే అది ఒక పర్సూట్ మాత్రమే. ఆనందం నిజంగా దొరికివుంటే దానిని అటైన్‌మెంట్ ఆఫ్ హేప్పినెస్ అనేవారేమో", దీర్ఘంగా ఆలోచిస్తూ అన్నాడు ఆదిత్య.

"వావ్!! చాలా డీప్‌గా చెప్పావే!! కాని ఇంటర్వ్యూలో ఇలా మాట్లాడితే నీకు సిటిజెన్‌షిప్ ఇవ్వరేమో...." నవ్వింది రమ.

"ఓకే. నేను వెళ్ళే టైం అయింది" అని లేచాడు ఆదిత్య.

* * *

ఆదిత్య సిటిజెన్‌షిప్ ఇంటర్వ్యూ విజయవంతంగా పూర్తి చేశాడు.

మరికొన్ని వారాల తరువాత ఓత్ ఆఫ్ అలీజియన్స్ సెరెమొనీకి వెళ్ళాలి ఆదిత్య.

ఆదిత్య, రమ స్టార్‌బక్స్‌లో కూర్చుని జింజర్ బ్రెడ్ లాటే తాగుతున్నారు.

"సో.... ఇన్ని సంవత్సరాల తరువాత, చివరికి నువ్వు అమెరికన్ సిటిజెన్ కాబోతున్నావు. హౌ డూ యూ ఫీల్?" అడిగింది రమ.

"వెరీ ఎక్సైటింగ్. అమెరికన్ పాస్‌పోర్ట్ కోసం ఎప్పటినుంచో కలలు కంటున్నాను. ఆరోజు దగ్గరపడింది" చెప్పాడు ఆదిత్య.

"కాని నువ్వు ఇండియన్ సిటిజెన్‌షిప్ కోల్పోతున్నావు. బాధగా లేదూ?" అడిగింది రమ.

"లేదు. నేను అమెరికన్ పాస్‌పోర్ట్‌తో ఎప్పుడు కావాలంటే అప్పుడు ప్రపంచం అంతా తిరగవచ్చు. వీసా తీసుకొని ఇండియాకి కూడా వెళ్ళవచ్చు. నో ప్రాబ్లెం!!" చెప్పాడు ఆదిత్య.

"కానీ నువ్వు పుట్టి, పెరిగిన, నీ స్వదేశమైన ఇండియాకి వెళ్ళటానికి వీసా తీసుకోవాలి. అప్పుడు నువ్వు ఇండియాలో ఫారెనర్ అవుతావు." చెప్పింది రమ.

"రమా, నన్ను కన్విన్స్ చేసే ప్రయత్నం చెయ్యకు. నేను ఎలాగయినా అమెరికన్ సిటిజెన్ అవుతాను. అంతే!!" సీరియస్‌గా అన్నాడు ఆదిత్య.

★ ★ ★

ఆరోజు జులై 15, 2015.

ఆదిత్య సిటిజెన్‌షిప్ ఓత్ ఆఫ్ అలీజియన్స్ తీసుకునే రోజు.

ఆదిత్య టెక్సస్‌లో సాన్ ఆంటోనియో నగరంలో వున్న ఇమిగ్రేషన్ ఫీల్డ్ ఆఫీసులోకి వెళ్ళి చాలాసేపయింది.

అతని కోసం వేచి చూస్తూ బయట కూర్చుని వుంది రమ.

మరికొన్ని నిముషాల తరువాత బయటకి వచ్చాడు ఆదిత్య.

"ఏమయింది?" అడిగింది రమ, కారు స్టార్ట్ చేస్తూ.

"నేను సిటిజెన్‌షిప్ తీసుకోలేదు" చెప్పాడు ఆదిత్య.

"వాట్?? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది రమ.

"అమెరికన్ సిటిజెన్‌షిప్ తీసుకుంటే, ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ ఏక్ట్ సెక్షన్ 337-5ఎ ప్రకారం నేను అమెరికా తరఫున ఆయుధాలు ప్రయోగించటానికి సిద్ధంగా వుండాలి. అంటే ఇతర దేశాల మీద యుద్ధానికి వెళ్ళటానికి సిద్ధంగా వుండాలి. అంటే భారతదేశం మీద కూడా యుద్ధానికి వెళ్ళటానికి సిద్ధంగా వుండాలి. దానికి నేను నిరాకరించాను." చెప్పాడు ఆదిత్య.

"మరి ఇప్పుడు ఏం చేద్దామనుకుంటున్నావు?" అడిగింది రమ.

"ఐ నీడ్ ఏ వెకేషన్. నేను ఒక నెల రోజులు ఇండియా వెళ్ళొస్తాను!!" చెప్పాడు ఆదిత్య.

★ ★ ★

ఆదిత్య ఇండియా వెళ్ళి పదిరోజులయ్యింది.

రమ స్టార్‌బక్స్‌లో కూర్చుని కారమెల్ బ్రులే లాటే తాగుతూ న్యూస్ పేపర్ చదువుతోంది.

న్యూస్ పేపర్‌లో ఒక ప్రకటన ఆమె దృష్టిని ఆకర్షించింది.

వెంటనే తన హేండ్‌బేగ్ లోంచి సెల్‌ఫోను తీసి, ఆదిత్యకి ఫోను చేసింది.

"ఆదిత్యా నీకొక గుడ్‌న్యూస్. ఇప్పుడే పేపర్‌లో చదివాను. ఇమిగ్రేషన్‌వాళ్ళు రూల్స్ మార్చారు. USCIS పాలసీ అలర్ట్ PA-2015-001 ప్రకారం, జులై 21, 2015 నుంచి ఓత్ ఆఫ్ అలీజియన్స్ లోంచి అమెరికా తరఫున ఆయుధాలు ప్రయోగించే నిబంధన తొలగించమని రిక్వెస్ట్ చెయ్యవచ్చు!!" ఉత్సాహంగా చెప్పింది రమ. ✤

MATHNASIUM®
The Math Learning Centre
Round Rock
512-415-5371
Cedar Park
512-869-6284

పాట

# జై త్రిలింగ దివ్య ధాత్రి! జై మహాంధ్ర మాతృమూర్తి! జయజననీ! జయజననీ!

- డా॥ అహోబిల వర్ఘుల మురళీకృష్ణ

జై త్రిలింగ దివ్య ధాత్రి! జై మహాంధ్ర మాతృమూర్తి!
జయజననీ! జయజననీ! జయ జయ జయ జయ జననీ! ॥ జై త్రిలింగ దివ్య ధాత్రి ॥

గోదావరి, కృష్ణవేణి, తుంగభద్ర, పినాకినీ!
నాగావళి, వంశధార, గుండ్లకమ్మ, కుముద్వతీ!
పుణ్యనదీ పరిభూషిత, సస్యశ్యామల మూర్తీ!
సస్య శ్యామల మూర్తీ! ॥ జై త్రిలింగ దివ్య ధాత్రి ॥

శాతవాహనాది శక్తి, కాకతీయ కదన గరిమ!
నాగార్జున మహాయాన, బౌద్ధ ధర్మ తత్వనిరతి!
కృష్ణరాయ 'భువనవిజయ' సభాస్థలీ వైభవమ్ము!
నీ చరితకు మణి పూసలు! నీ కీర్తికె బావుటాలు!! ॥ జై త్రిలింగ దివ్య ధాత్రి ॥

నన్నయ్యా, తిక్కన్నా, ఎఱ్ఱాప్రగడ లాదిగ,
అల్లసాని, భట్టుమూర్తి, ధూర్జటి, మరి రామకృష్ణ!
శ్రీనాథుడు, పోతన్నా, గురజాడా, విశ్వనాథ!
రమ్య కావ్య సంశోభిత, రత్నగర్భ తెలుగు తల్లి! ॥ జై త్రిలింగ దివ్య ధాత్రి ॥

అన్నమయ్య పదభూషిత, శేషశైలవాసు నెలవు!
రామదాసు భక్తికవిత ప్రభవించిన పుణ్యభూమి!
సిద్ధేంద్రుని కూచిపూడి నృత్యశాస్త్ర సంశోభిత!
త్యాగబ్రహ్మ గానరసము, చిలికిన పలుకులతల్లీ!! ॥ జై త్రిలింగ దివ్య ధాత్రి ॥

తెలుగు మాట! తెలుగు పాట!
తెలుగు దనము! తెలుగు ప్రతిభ!
తెలుగువాడు! తెలుగు నాడు!
నిలుచును ఆచంద్రార్కం! అక్షరాల ఇదే నిజం!! ॥ జై త్రిలింగ దివ్య ధాత్రి ॥

అక్షరాల ఇదే నిజం!! అక్షరాల ఇదే నిజం!! అక్షరాల ఇదే నిజం!!

పాట

## ఈ రోజే కొత్తగా

- రాధిక

పల్లవి :

మనసాగనంటోంది నీ ఊహలతో సాగిపోతూ
నవ్వుతోంది గమ్మత్తుగా.... ఈరోజేదో కొత్తగా
కల తీరనంటోంది నీ ఊసులతో కమ్మగా
వెన్నెలయ్యింది వెచ్చగా.... ముద్దు కోరింది మత్తుగా

చరణం - 1 :

ఎరుపెక్కిన రేయినడిగా ఏమయ్యిందో చెప్పమని
రాగమేదో రేగింది.... కేరింతై ఎగిసింది
పరవశించిన పూలనడిగా ఎందుకన్ని పులకింతలని....
వలపేమో ఒణికింది.... గంధమేదో పూసింది
నీ ఊహలతో కమ్మగా.... కల తీరనంటోంది
ఈరోజేదో కొత్తగా వెన్నెలయ్యింది వెచ్చగా

చరణం - 2 :

రసడోలలూగింది నాలో స్వరం....
నీ చూపు జల్లుగా కురవగానే
శృతి చేయమంటుంది అనురాగం....
నీ తపన పాటగా పాడగానే
పల్లవించిన ప్రేమనడిగా నీ కన్నుల్లో ఎవ్వరని
చినుకేదో కురిసింది.... ఆనందమై రాలింది
కెంపులైన బుగ్గనడిగా నాలో సిగ్గులు దేనికని
మైమరపు మెరిసింది.... ఉయ్యాలలు ఊపింది....
నీ ఊసులతో కమ్మగా ఈరోజేదో కొత్తగా
వెన్నెలయ్యింది వెచ్చగా.... ముద్దు కోరింది మత్తుగా.....

పాట

## ఏ రాగమో....

- రాధిక

పల్లవి :

ఆమె : ఏ రాగమో అది... నీ చిరునవ్వుగా మారినది
అనురాగమై చేరింది.... ఆకాశమై మది పాడింది
అతను : ఏ మోహమో అది.... నీ హృదయమునే కోరినది
బంధమై పెనవేసింది.... స్వప్నమై దరిచేరింది.....

చరణం - 1 :

ఆమె : కాటుక కన్నుల కల్పన నీవై ఉండిపోవా
మురిసే పెదవుల మధురిమ నేనై కరిగిపోతా
అతను : అల్లరిగాలుల శ్వాసవు నీవై అల్లుకోవా
మరుమల్లెల రాతిరి ఊసువు నీవై నవ్వుకోవా
ఆమె : ఏ విరహమో అది... వసంతమై వచ్చి పొమ్మన్నది
వరాలనే ఇచ్చి పొమ్మన్నది....

చరణం - 2 :

అతను : ఆమని పాడే మధుగీతికవై పాడరావా
ఊహలు గీసే నవచిత్రానివై కలిసిపోవా
ఆమె : చినుకుగ సాగే మేఘమై కురిసిపోవా
వెన్నెలై నిలిచే పున్నమై తడిసిపోవా
అతను : ఏ భావమో అది.. ఉదయమై ఉండిపొమ్మన్నది
సంగీతమై వినిపించమన్నది....

# La Frontera Dental, PLLC

Cosmetic and Family Dentistry

*La Frontera Dental, where your confidence matters*

## *Dr. Satish Thirumalai, D.M.D.*



Our mission is to protect the dental health of our patients through prompt diagnosis and treatment of oral diseases. Our services in dentistry include preventative, corrective, cosmetic dentistry including Implants, Invisalign and wide range of other procedures.
Dr. Satish and his skilled team are committed to provide exemplary dental care and will provide individual attention and personalized care. We take care of all your family dental needs using modern technology to provide you a pain free and pleasant dental experience. Please call to make an appointment.

Located at:
2711 La Frontera Blvd, Ste 270., Round Rock, TX 78626

**www.lafronteradental.com**
**512-358-1215**

చిన్నికథ 1

# మౌంతైన్ అద్దమందు కొంచెమై ఉండదా?

- పాలపర్తి ఇంద్రాణి

పద్యాలు
వల్లెవేయిస్తోంది
అమ్మ పాపచేత.
అంతకుముందు
నేర్పించిన పద్యాలు
ముందు చెప్పాలి.
రోజూ చెప్పాలి.
పళ్ళు తోముకునేటప్పుడు.
మొక్కలకి
నీళ్ళు పోసేటప్పుడు.
వంటింట్లో
ఆడుకునేటప్పుడు.
అన్నం తినేటప్పుడు.
ఎప్పుడు అడిగితే అప్పుడు.
పాపకు
ఇష్టంలేదు. కానీ
చెబుతుంది. పాపం అమ్మ
అడుగుతోంది కదా
అని.
అప్పుడు
ఆరోజు అమ్మ గబుక్కున,
"అనువుగాని చోట"
చెప్పు! అంది.
అన్నుగాని ఛోత
అదికులమనరాదు కొంచెముందు
తెల్ల కొదువ కాదు.. తల
అటూ ఇటూ ఆడిస్తూ
చెబుతోంది పాప.
కాని
తరువాత ఏవిటో గుర్తుకు
రాలే.

అందుకని
మళ్ళా మొదట్నించి
ఎత్తుకుంది.
అన్ను
గాని ఛోత
అదికులమనరాదు కొంచెముందు
తెల్ల కొదువ కాదు.
అయినా గుర్తుకు
రాలే.
మళ్ళా అన్ను
గాని ఛోత
అదికులమనరాదు అంటో
రికార్డు వెయ్యబోతే,

ఏవిటి అనువుగాని
చోట అనువుగాని చోట నీ
మొహం! మిగిలింది చెప్పు
అని విసుక్కుంది
అమ్మ.
పాపకు పద్యం
గుర్తొస్తొంది కొంచెం
కొంచెం గానీ మిగిలిన
పద్యంలో మొదటిపదం ఓటి
మర్చిపోయింది. అందుకే
ఇంత ఆలోచన అయింది పాప
బుర్రకు.
అమ్మ అరుపు వినగానే,
మౌంతైన్ అద్దమందు
కొంచెమై ఉందదా? విస్వదాబి
రామ వినర వేమా! అని
పూర్తి చేసేసింది.

పాట

## ఓ ప్రియా

- రాధిక

పల్లవి :

ఓ ప్రియా... పలుకవా... పల్లవై ప్రియతమా
నిన్ను తలచి మురిసిపోయే మదినే చేరవా
నన్ను వలచి మరులుకురిసి వలపే పంచవా....

చరణం - 1 :

కలలా కలసిన స్నేహం ప్రేమగ మారెనుగా
ఊసులు గెలిచిన మౌనం నిదురను దోచెనుగా
మనసే మధురమాయే నీ జతలో తీయగా

చరణం - 2 :

పెదవులు చిలికెను రాగం కుంకుమ వన్నెలుగా
కాలం కదలని వైనం తలపును తడిమెనుగా
సాగసే వెన్నెలాయే ఆనందం సాక్షిగా

చరణం - 3 :

చిరునవ్వుల నా లోకం పరవశ గీతమునా
కనుగొన్నా నా గమ్యం నీ బిగికౌగిలిలోనా
కరిగే మోహమంతా ఆకాశం నేనుగా....

## మంచిమాటలు

ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని
దూరంచేస్తే,
ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్ని
నాశనం చేస్తుంది.

చప్పట్లు కొట్టి మనల్ని పొగిడే మనుషుల్ని
మర్చిపోవచ్చు.... కానీ,
చేయూతనిచ్చి మనల్ని అభివృద్ధిలో పెట్టిన మనుషుల్ని
మరువకూడదు.....

కాలాన్ని వృథా చేయడమంటే....
నిన్ను నువ్వు దోపిడీ చేసుకోవడమే.

పాట

## మల్లెల మాసం

- రాధిక

పల్లవి :

మల్లెలమాసం పిలిచినవేళ మౌనం మువ్వై మ్రోగెనుగా
అల్లరిరాగం పలికినవేళ పల్లవి తానై కదిలెనుగా
చిలిపి సావాసమా నీది వలపు దరహాసమే కోరి
ముద్దమందారమే నేనై ప్రణవ ద్వారాలనే తీసి
కదిలా నీవైపే.. నదిలా... నీ చెలిగా....

చరణం - 1 :

నీ చూపుల నవ్వులే మంత్రించగా నన్నే మరచిన క్షణమిదిగా
నీ రెప్పల మాటున రూపం నేనై వెలిగిన భావము నిజమేగా
ఆమని సౌందర్యమే నేనై జతుల సరసాలనే పాడి
అనాది అనురాగమే నీకై మదిలో వివశాలనే రేపి
అల్లరిరాగం కదిలెనుగా పల్లవి తానై పలికినవేళ
కదిలా నీవైపే.. నదిలా... నీ చెలిగా....

చరణం - 2 :

నీ ఊసుల తొలి ఆనందంలో నా కలలె కదలాడెనుగా
నీ మోహపు చలి సాయంత్రంలో నీలో సగమై ఒదిగెనుగా
నీలాల తారక నేనై నీ రాతిరి వెలిగించి
రగిలే మది తాపం తోడై సిగ్గులకే సెలవిచ్చి
మల్లెల మాసం మ్రోగెనుగా మౌనం మువ్వై పిలిచినవేళ
కదిలా నీవైపే.. నదిలా... నీ చెలిగా....

RAM KONARA
REALTOR - (469)964-2033

512-713-4099
Brindavan
Events
We facilitate...
You celebrate
website : www.brindavanevents.com
E-mail : contact@brindavanevents.com

పాట

# చివరి ప్రయాణంలోగా

- రాధిక

జ్ఞాపకాల మూటను మోయలేక అలసిపోతావప్పుడు
పంచుకునేందుకు నేనుండను
ఒక తీయని మాటేదైనా ఉంటే వినిపించవూ....

నన్ను కనులారా చూడాలనుందనుకుంటావ్
కలనైనా కనపడమని అర్థిస్తావ్
కన్ను మూసేలోగా కొన్ని క్షణాలైనా కరుణించవూ

నా పలుకు తీపులకై కలవరిస్తావప్పుడు
కానీ వినేందుకీలోకాన్ని విడిచిపోతాను
ఈలోపే హృదయాన్ని ఆలకించవూ

నీ ఊసులకు మురుస్తానని తెలిసీ
మౌనంతో నన్ను నిరాకరిస్తావ్
దాచుకున్న మనసు ముసుగోసారి తీయవూ....

నాలో తప్పులనే తలపోస్తూ వెక్కిరిస్తావ్
అస్థిత్వమొకటుందని గమనించవు
నాలోని ఆవేశాన్నిప్పుడే మన్నించవూ

త్వరలో మరణం నన్ను పొలిమేర చేర్చక తప్పదు
పావుకోళ్ళు ధరించిన వసంతుడివై
ఈలోపే నన్ను దరిచేరి ఆదరించవూ..!!

Sadly.. The Only Way Some People
Will Learn To Miss U is by Lossing U....

పాట

# విషాద వలయం

- రాధిక

ఎన్నో అనుకుంటాం
ఉదయాన్నే ఓ ఉద్విగ్నతొచ్చి నిద్దురలేపాలని
ప్రేమగా ఓ చేయొచ్చి ముంగురులను సవరించి లాలించాలని
ఘడియకో చిరునవ్వుల వర్షం పెదవులపై కురవాలని
లోకం కనిపించని చిక్కని రాగబంధంలో ఇమిడిపోవాలని
క్షణాలకు తీరిక లేనంత వడిగా కాలం ప్రవహించాలని
అనుబంధానికో సరికొత్త నిర్వచనమిచ్చి ఆదర్శమవ్వాలని..
కానీ
ఎందరో మగమహారాజులు
అధికారంతో ఆడదాన్ని అణచాలని చూసేవారు
అహంకారంతో ఆగడం చేసి స్త్రీని హింసించేవారు
తనలో బలహీనతల్ని వాదనతో గెలవాలని ఎగిరేవారు
విచక్షణారహితానికి మగటిమితో ముసుగేసేవారు
సామాజిక కట్టుబాట్లను చూపి స్త్రీని
నిస్సహాయతకు పురిగొల్పేవారు
మనసులో వికృతానికి ప్రేమనే పూతేసి ఉచ్చు బిగించేవారు
పురుషాధిక్యతతో సర్దుకుపోమని సలహా ఇచ్చేవారు
కళ్ళలో నీళ్ళు మాత్రమే నింపడం చేతనైన మహాపురుషులు
అందుకే
బంధాలంత బలహీనం
అనుబంధం
కొన్ని జీవితాల్లో విషాద వలయం....

# శ్రీనాధుడి పల్నాటి వర్ణన పద్యాలు

- డా॥ అహోబిల వర్ఝుల మురళీకృష్ణ

## పల్నాడు వూళ్ళు, జీవితం :

చిన్న చిన్న రాళ్ళు, చిల్లర దేవుళ్ళు,
నాగులేటి నీళ్ళు, నాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్ళు, చలిదన్నమును తేళ్ళు,
పల్లనాటి సీమ, పల్లెటూళ్ళు!

కం : రసికుడు పోవడు పల్నా
దెసగంగా రంభయైన, ఏకులె వడకున్,
వసుధేశుడైన, దున్నును,
కుసుమాస్త్రుండైన, జొన్న కూడే కుడుచున్!

(రసికుడు పల్నాడు వెళ్ళి భరించలేడు. ఎందుకంటే, అక్కడ రంభయైనా ఏకులు వడకుతూంటుంది. రాజు కూడా పొలం దున్నుతుంటాడు. మన్మథుడైనా జొన్నన్నము తినక తప్పదు).

కం : జొన్న కలి, జొన్న యంబలి
జొన్నన్నము, జొన్న పిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగ పల్నాటిసీమ ప్రజలందరకున్!

శ్రీనాథుడు పల్నాడులో ప్రయాణం చేస్తుంటే నీళ్ళు దొరక్కపోతే చెప్పిన పద్యం

కం : సిరిగలవానికి జెల్లును
వరుసగ పదియారువేల వనితలనేలన్ (Or) తరుణుల పదియారువేల తగ పెండ్లాడన్
తిరిపెమున కిద్దరాంఢ్రా!
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్!!

(పై పద్యాల్లో అర్థంగాని పదాలు లేవు గాబట్టి తాత్పర్యం విడిగా వ్రాయడం లేదు) ✤

smartwe


Biryani Pot
Authentic Hyderabadi Food House
12407 N. MOPAC EXPY., SUITE 200B
(THE MARKET AT PARMER LANE)
AUSTIN, TX 78758
Serving Zabihah Halal Meat Only
Tel: 512-837-4444
email: austin@biryanipotusa.com
www.biryanipotusa.com
www.facebook.com/ biryanipotaustin
DINE IN - TAKE OUT -CATERING


Mirafashionllc
MINNEAPOLIS
Exclusive Silk saree collection & more
Mira Fashions
ALL ABOUT SILK
Grand Silks Sale!!!
SALE
Pattu Saris
You are cordially invited for the exclusive silks Exhibition & Sale @
Directly from the Weavers!
Doubletree by Hilton (Bloomington)
7800 Normandale Blvd, Minneapolis, MN 55439
Friday & Saturday August 18th – 19th 10 AM – 6PM
Our collection includes
•Pure Silk, Designer Saris
•Designer Ghagra Cholis( Kids As Well )
•Kanjivaram Silk Sarees
•Readymade Blouses
•Men's Kurtas, Vests
•Custom Jewelry
•Stoles & Scarves
•Gift Items
mirafashionsllc@gmail.com
612-562-4379 | 214-550-0213
www.thesilkplace.com

పాట

## శిశిరమూ – సోయగమూ

– రాధిక

ఒక్కో ఆకు రాలుతున్న సవ్వడిలో
ఒక్కో కల కరిగినట్లు
కాలం పొరలు విప్పుకుంటూ కదిలిపోతుంటే
పురివిప్పుకోడానికి సిద్ధమైన ప్రకృతి
వెన్నెల్లో పాదరసం కలిసి జాలువారుతున్న
తొలిపొద్దు సౌందర్యం
జిలిబిలి సీతాకోకచిలుకల్లోని రంగులు పులుముకున్నట్లు
క్షణానికో పరవశాన్ని కట్టబెడుతుంది..

పూలగంధాల పన్నీటి తీపులు
మధురభావాల పక్షుల పాటలు
పరిమళాలను ప్రవహించే సెలయేరు
కోమల సమీరపు మెత్తని తాకిళ్ళు
హృదయంలో రసానుభూతుల రాగాలు
గుంపులుగా తరముకొస్తున్న భావాలు
రెక్కలొచ్చి ఎగిరిపోకముందే
అక్షరం చేసి బంధించాలనుకోగానే
ఏకాంతం సాయమొచ్చింది
ఇప్పటికింకా జ్ఞాపకాల గిచ్చుళ్ళు మొదలవనందుకు
శిశిరాన్ని సైతం మనసు చేరదీసింది....

## తెర

– రాధిక

ఎప్పటినుంచో కప్పుకున్న తెర
ఇన్నాళ్ళూ మనసు చాటు చేసి
తనకూ నటించడం చాతనవుననే
విషయాన్నలా గుర్తుచేసుకుంది

శిలలాంటి హృదయాల నడుమ
కుటిల మనస్తత్వాలు.... తడి తెలియని భావాలు
అంధకారపు ప్రతిబింబాలు
వీటి నడుమ ఇమడలేనంటూ
పాత్రల్లో ఒదిగిన నీటివలే
తనకు తానే అబద్ధాన్ని ముసుగేసుకుంది

ఇప్పుడొక ఉషస్సుని పట్టుకోవాలనుకున్న ప్రతిసారీ
ఉదయకిరణాల రంగులు
వెక్కిరించి ఉరికినట్లనిపిస్తూ క్షణాలను వృథా చేస్తున్నాయి
విహంగాలై వలసొచ్చే ఊహలు సైతం
అస్తమించే ఏకాకితనాన్ని పలుకరించడం
అనవసరమని కదిలిపోతున్నాయి

రేయింబవళ్ళు వ్యత్యాసమెరుగని నటనలో
ఆరితేరిపోయాక
అంతరాత్మ ఘర్షణ అక్షరాలను తాకింది
ఋతువులనే రాయాలనుకున్నాక
గ్రీష్మమైనా శిశిరమైనా తప్పదనుకుంటూ..!!

## పొడుపు పద్యాలు

1. అన్న కందవు, అమ్మ కందుతాయి ?
2. కంపలో పెంకు, పెంకులో శంఖు, శంఖులో తీర్థం
3. బంగారు భరిణలో రత్నాలు
   పగుల గొడితేగాని రావు
4. పిఠాపురం చిన్నవాడా, పిట్టల వేటగాడా
   బతికిన పిట్టను కొట్టవద్దు,
   చచ్చిన పిట్టను తేనూ వద్దు
   కూరకు లేకుండా రానూవద్దు అందిట

జవాబులు : 1. చెప్పులు 2. కొబ్బరికాయ 3. దానిమ్మపండు 4. తేనెటీగ

చిన్నికథ 2

# నావల్ల నేనూ

- పాలపర్తి ఇంద్రాణి

పాపకి
దగ్గుతూ ఉంది.
రోజూ వేసుకోవాల్సిన
దగ్గుమందు ఆరోజు
వేసుకోకుండా పడుకుంది
పాప.
అమ్మ
పాపకి అన్నంపెట్టి ఇలా
వంటింట్లోకి వెళ్ళి
చక్కబెట్టుకుని పాపని
పడుకోబెడదామని
వచ్చిందో లేదో జో
అచ్చుతానంద
పాడకుండానే రోజూకన్నా
ముందే సోఫాలో పడుకుని
నిద్రపోతూ
కనిపించింది.
అయ్యో,
దగ్గుమందు వేసుకోలేదే
అని అమ్మ పాపని లేపబోతే
పాప ఊc ఊc అని మూలుగుతూ
లేవకుండా పేచీపెట్టి
అలాగే పడుకుంది.
అమ్మ ఇంక
ఏమీ చేయలేక తానూ
నిద్రకి
ఉపక్రమించింది.

నాన్న
ఆఫీసులో పని చాలా
బోలెడు పని.
అంతా
చేసి వచ్చి తానూ
నిద్రలోకి
జారుకోబోతుంటే పాప
దగ్గు మొదలు
పెట్టింది.
ఖళ్ ఖళ్
ఖళ్ ఖళ్
అటూ ఇటూ
దొర్లి మళ్ళీ
పడుకుంది.
మళ్ళీ
కొంచెంసేపయ్యాక
అదే ఖళ్
ఖళ్ దగ్గు.
ఖళ్ ఖళ్....
ఖళ్
ఖళ్....

అమ్మకి
నాన్నకి మెలకువ
వస్తూనే ఉంది.
అప్పటికీ
అమ్మ మందు ఇద్దామని

చూసింది గానీ లేపబోతే
పాప పెద్దగా ఏడ్చి
మళ్ళీ పడుకుంది.
రాత్రంతా
మగత నిద్రగానే ఉన్నది
అమ్మకి నాన్నకి
మందు
ఎందుకు ఇవ్వలేదు అన్న
విషయంపై ఇద్దరూ
కీచులాడుకున్నారు
అర్ధరాత్రి
కాసేపు.
పొద్దున్న
లేచాక,
దగ్గు
మందు వేయించుకోకుండా
ఎందుకు నిద్ర
పోయావు?
నీ వల్ల
అమ్మా నాన్న రాత్రంతా
నిద్రపోలేదు తెలుసా?
అంది అమ్మ కోపంగా.
నావల్ల
నేను కూడా నిద్దాయిలు
పోలేదు తెలుసా?
అంది పాప
ఆవలిస్తూ.

# శ్రీనాధుడు శ్రీకృష్ణుడికి విసిరన సవాలు / ఛాలెంజ్!

- డా॥ అహోబిల వర్ఝుల మురళీకృష్ణ

ఉ : పుల్లసరోజనేత్ర! యలపూతన చన్నుల పాలు ద్రావి నా
దల్ల దవాగ్ని మ్రింగితినటంచును నిక్కెదవేల! తింత్రిణీ
పల్లవయుక్తమౌ యుదుకు బచ్చలి శాకము జొన్న కూటితో
మెల్లగ నొక్కముద్ద దిగమ్రింగుము, నీపస గాన నయ్యెడున్!

అర్థం : (వికసించిన సరోజముల వంటి కన్నులు గల) "ఓ కృష్ణా! అపుడెపుడో పూతన చన్నుల పాలు (విషం) తాగాననీ, దావానలం మింగాననీ, డంబాలు కొట్టడం కాదు! ఒకసారి, ఈ పల్నాటికి వచ్చి, చింత చిగురుతో చేసిన ఉడుకు బచ్చలి కూర, జొన్న కూటితో, ఒక ముద్ద తినిచూడు! నీ పస తెలుస్తుంది!"

శ్రీనాధుడు అనవేమారెడ్డి ఆస్థానకవి! ఒకసారి, శ్రీనాధుడు అనవేమారెడ్డి శత్రువైన సర్వజ్ఞ సింగ భూపాలుని ఆస్థానానికి వెళ్ళి (బహుశా, అనవేమారెడ్డి వూళ్ళోలేని సమయంలో, శ్రీనాధుడికి డబ్బు బాగా అవసరం వచ్చిన సమయంలో అయివుండవచ్చు), ఆ రాజుగారి మీద, ఈ క్రింది పద్యం చెప్పాడట!

కం : సర్వజ్ఞ నామధేయము
శర్వునకే తక్క, రావు సింగ భూపాలునికే
యుర్వింజెల్లును; తక్కొరు
సర్వజ్ఞుదనుట! కుక్క సామజమనుటే!!

అర్థం : 'సర్వజ్ఞుడనే బిరుదు, ఆ ఈశ్వరునికీ, రావు సింగ భూపాలునికి మాత్రమే తగును! తక్కినవారి నెవరినైనా, సర్వజ్ఞుడంటే, కుక్కను ఏనుగుతో పోల్చడమే,' అని పొగడుతూ పద్యం చెప్పాడట! వెంటనే, సర్వజ్ఞ సింగ భూపాలుడు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయి పోయి (శత్రురాజు ఆస్థానకవి అంతగా పొగిడితే ఉబ్బి తబ్బిబ్బవడూ మరి!), శ్రీనాధుడికి, అక్షర లక్ష లిచ్చి, సత్కరించాడట!

సహజంగా, మన వాళ్ళొట్టి వెధవాయిలు గదా! పైగా, యిదేమీ రహస్యం కూడా కాదు! ఎలాగోలా, ఈ విషయం అనవేమారెడ్డి గారి చెవిన పడి ఆయన శ్రీనాధుడిని పిలిచి అడిగాడట!

శ్రీనాధుడు వెంటనే తడుముకోకుండా, "అయ్యా! నేను సర్వజ్ఞ సింగభూపాలుని మీద పద్యం చెప్పింది నిజమే! కాని, ఆ పద్యం నేను ఆయనను పొగడుతూ చెప్పలేదు. ఆయన, ఆ బిరుదుకు తగడని ఆక్షేపిస్తూ చెప్పాను. కాని, ఆ విషయం అర్థం చేసుకోకుండా వాళ్ళు నాకు సన్మానం చేశారు అని, అదే పద్యాన్ని యిలా 'పంక్చుయేషన్' మార్చి, చదివి వినిపించాడట!

కం : సర్వజ్ఞ నామధేయము
శర్వునకే తక్క, రావు సింగ భూపాలునికే
యుర్వింజెల్లును? తక్కొరు
సర్వజ్ఞుదనుట! కుక్క సామజనుటే!!

ఇలా పంక్చుయేషన్ మార్చి, అంటే ప్రశ్నార్థకం పెట్టి చదివితే ఈ పద్యానికి అర్థం ఇలా మారిపోతుంది :

"సర్వజ్ఞుడనే బిరుదు, శివునికేగాని, రావుసింగ భూపాలునికి ఎలా చెల్లుతుంది? (శివుణ్ణి కాకుండా) మరెవరినైనా సర్వజ్ఞుడంటే, కుక్కను ఏనుగ అని పిలవడమే కదా!" అని ఆక్షేపించాను అని అన్వయంచెప్పి ఒప్పించాడట!

కవిత

# కవిత్వం

- పాలపర్తి ఇంద్రాణి

మరీ
కిందికి
వెళ్ళిపోకు పెను
దుఃఖపు పాకంలోకి
మరీ
పైపైకి తేలిపోకు అమందానందపు
ఆవిరిలోకి
రెంటికీ
మధ్యలో సన్న గీత
ఉందే, సరిగ్గా
అదిగో అక్కడే
ఉండు
కవిత్వం
హల్వాలా ఉడుకుతూ
ఉంటుందక్కడ కుతకుతలాడుతూ రెప్పలు
వేస్తూ



"నమ్మకమైన నూనె - మలినమ్ము నెరుంగని ఉప్పు
కొత్త కారమ్మును ఆవపిండియును రమ్యముగా సరిపాళ్లలో
రసాలమ్ములు చేర్చి కూర్చి రుచులన్ చవు లూరగ చేయగా
ఏ మనం బమ్ముడు వోప దీ కలియుగాద్భుత మాయకు -
ఆవకాయకున్"

- కొండేపూడి సుబ్బారావు

('దేశ భాషలందు తెలుగు లెస్స' పుస్తకం సౌజన్యంతో)

# సుమతీ శతకాలు

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెప మెన్నక సేయువాడె నేర్పరి సుమతీ!

ఎప్పుడు సంపద గలిగిన
నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్
దెప్పలుగ జెరువు నిండిన
కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!

కూరిమి గల దినములలో
నేరము లెన్నడును గలుగ నేరవు మఱి యా
కూరిమి విరసం బైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!

కొఱగాని కొడుకు పుట్టిన
కొఱగామియె గాదు తండ్రి గుణముల చెఱచున్
చెఱకు తుద వెన్ను పుట్టిన
చెఱకున తీపెల్ల చెఱచు సిద్ధము సుమతీ!

చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైన యట్లు పామరుడు తగన్
హేమంబు కూడ బెట్టిన
భూమీశుల పాల చేరు భువిలో సుమతీ!

తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరక మండ్రు తథ్యము సుమతీ!

విన దగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింప దగున్
కని కల్ల నిజము దెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

Excel in School; Succeed in Life!

Eye Level Learning Center

MATH + ENGLISH

www.myeyelevel.com

with Critical Thinking Curriculum




512-817-3955

OXFORD US ACADEMY

TEAM OF EXPERTS

oxfordusacademy.com

Global Creative Arts Academy

Estd: 2016

GCAA

# సరదా కవిత్వం - పరాచికాలు

- డా॥ అహోబిల వర్ఘ్యుల మురళీకృష్ణ

ఇంటింటా ఆశుకవిత్వంలో పరాచికాలడుకునే రోజులవి! ఆరోజుల్లో, వెన్నెట్లో ఆరుబయట నులకమంచం మీద కూర్చొని తాంబూలం వేసుకొంటూన్న ఓ బావగారు, సున్నం తెచ్చిపెట్టమని తన మరదలు పిల్లని యిలా అడిగి, వుడికించాడట!

**పర్వతశ్రేష్ఠు పుత్రిక పతివిరోధి**
**అన్న పెండ్లాము అత్తను గన్న తండ్రి**
**ప్రేమతోడుత ఆతని పెద్ద బిడ్డ!**
**సున్నమిప్పుడు తేగదే సన్ను తాంగి!**

పర్వత శ్రేష్ఠుడు = హిమవంతుడు; పుత్రిక = పార్వతి; పతి = శివుడు; విరోధి = మన్మథుడు; అన్న = బ్రహ్మ (విష్ణువు బొడ్డులోంచి పుట్టాడు కాబట్టి); పెండ్లాము = సరస్వతి; అత్త = లక్ష్మీదేవి; కన్నతండ్రి = సముద్రుడు; ఆతని పెద్ద బిడ్డ = జ్యేష్ఠాదేవి.

అర్థం : "ఓ జ్యేష్ఠా దేవీ! సున్నం తీసుకురా!" అని అడిగి, తన పాండిత్య ప్రకర్ష చూపించాడట!

ఆశు కవిత్వంలో తక్కువ తినని ఆ మరదలు పిల్ల సున్నం తెచ్చి చేతికిస్తూ యిలా ఘాటుగా కందంలో సమాధానం చెప్పిందట!

**కం :** **శతపత్రంబుల మిత్రుని**
**సుతుజంపినవాని బావ సూనుని మామన్**
**సతతము తలధరియించెడి**
**సుతవాహన వైరి వైరి సున్నంబిదిగో!**

శతపత్రంబుల మిత్రుడు = సూర్యుడు; సుతుడు = కర్ణుడు; జంపినవాడు : అర్జునుడు; వానిబావ = శ్రీకృష్ణుడు, సూనుడు = కొడుకు (మన్మథుడు); మామ = చంద్రుడు (లక్ష్మి, చంద్రుడు సముద్రంలో పుట్టారు కాబట్టి తోబుట్టువులు), సతతము తలధరియించెడివాడు = శివుడు; సతుడు = శివుని కొడుకు వినాయకుడు; వాహనము = ఎలుక; వైరి = పిల్లి; వైరి = కుక్క; సున్నంబిదిగో!

అంటే, ఆ మరదలు పిల్ల 'ఓ కుక్కా! సున్నమిదిగో!' అంటూ బావగారికి సున్నమందించిందన్నమాట! మరదలు పిల్ల అంత ఘాటుగా సమాధానం చెప్పేసరికి ఆ బావగారు అవాక్కయి నోరుమూసుకుని వుంటాడనేది తథ్యం (మరి తాంబూలం ఎలా వేసుకున్నాడనేది వేరే విషయం)


మరో అందమైన తిట్టు పద్యం

**నగ పగతు పగతు పగతుని**
**పగతుండౌ మగధరాజు బరిమార్చిన యా**
**జగజెట్టి అన్న తండ్రికి**
**తగు వాహనమైనయట్టి ధన్యుండితడే!**

నగ పగతుడు = ఇంద్రుడు; పగతుడు = రాక్షసుడు (ఉదా : హిరణ్య కశ్యపుడు, రావణుడు); పగతుడు = (రాక్షసుల శత్రువైన) విష్ణువు / శ్రీకృష్ణుడు; పగతుండౌ మగధరాజు = శ్రీకృష్ణుని శత్రువైనట్టి మగధరాజు జరాసంధుణ్ణి; పరిమార్చిన జగజెట్టి = భీముడు; అన్న = ధర్మరాజు; తండ్రి = యమధర్మరాజుకు తగువాహనమైనయట్టి ధన్యుడు = దున్నపోతు

అర్థం : కవిగారు వీడు వట్టి దున్నపోతు అని వాడికి అర్థం కాకుండా మనకు చెబుతున్నాడన్నమాట!

*With Best Compliments From :*



SteckSystems

HealthCare.com
HealthCare Made Simple

Koteswara Rao Kunda, MD

పాట

# మనసుపాట

\- రాధిక

ఎన్ని దశాబ్దాలుగా అనుసరిస్తున్నదో
ఓ మనసు పాట
ఇప్పటికీ అదే ఆర్తితో
వినాలనిపించే మధువొలుకు పాట
అయితే
వెన్నెలొలుకు రాతిరిలో
విషాదాన్ని మోసుకొస్తున్న ॥ శివరంజని ॥
విరహాన్ని రగిలించి
గుండె గొంతులోకొచ్చేట్టు ఏడిపిస్తుంది

ఆగడం తెలీదనుకున్న కాలానికి
హృదయాన్ని లయ తప్పించడమెలా తెలిసిందో
ఊహల పువ్వులన్నీ
రాతిరి కొమ్మకు వేళ్ళాడుతూ పరిమళిస్తున్నా
నువ్వు లేని పున్నమి
అంతరంగాన్ని మీటనంటోంది

అసలే వెచ్చని కన్నీటికి తోడు
గుండెలో గాయమేదో స్రవించినట్లు
గుట్టుగా గుబులొకటి పోటెత్తినట్లుంది
వినకూడదనుకుంటూనే విన్నందుకేమో
ఇప్పుడీ ప్రాణ విహంగం నీరసించింది
నీకైన ఎదురుచూపుల్లో
వసంతపు కలలను సైతం ప్రతిఘటిస్తుంది

పాట

# ఆమె

\- రాధిక

ఆమె నవ్వింది....
అవమానాల గతాన్ని అడుసులోకి తొక్కి
ఊపిరి బరువెక్కిన క్షణాలను దాటి
చేదు కన్నీటిని విదిలించి నిశ్శబ్దాన్ని నెట్టుకుంటూ
హృదయ శకలాలను శిధిలాలకు ఒప్పగిస్తూ
తనను తానో అద్భుతమని గుర్తు చేసుకుంటూ
మనసారా నవ్వింది

ఆమె నేర్చింది....
కొత్తగా మౌనాన్ని నేర్చింది
మనసు విరిచే మాటల్ని గాలికొదిలి
వ్యర్ధమైన విషయాలపై కుతూహలాన్ని ఆపివేసి
ఆపద్ధర్మపు స్నేహాలపై ఆసక్తిని హరించి
అక్షరాలకు గొంతిచ్చి స్వరపేటికకు మూతపెట్టి
తిమిరానంతర వెలుగొచ్చి
తనకు మరో పుట్టుకనిస్తుందని
మనసా వాచా నమ్మింది

ఆమె కదిలింది
అడుగులకు పైమెట్టు లక్ష్యాన్ని నిర్ణయించి
తనలోని చలనంతో ఆత్మవిశ్వాసాన్ని కూడదీసుకుంటూ
ఆశాకిరణాల కాంతిపుంజాల్లో నడక దిద్దుకుంటూ
ఉత్సాహం గొంతువిప్పి
క్రొంగొత్త ఊహలను పాడుకుంటూ
చపలచిత్తాన్ని పునాదులతో పెకిలించి విముక్తిపథంవైపు
పొరలుపొరలుగా విషాదాన్ని రాల్చుకుంటూ.... గెలుపు దిశగా
శూన్యాన్ని వెక్కిరిస్తూ కదిలింది.

Mathews
CPA Inc.

O: 512-710-1000
C: 512-785-6495
Fax: 512-356-9717
Email: mathews@mathewscpainc.com

9415 Burnet Road
Ste 210
Austin TX 78758

www.mathewscpainc.com

ABHINAYA
SCHOOL OF KUCHIPUDI






ఉగాది మరియు
శ్రీరామ నవమి వేడుకలు
Ugadi & Sri Rama Navami Celebrations
స్వాగతం... సుస్వాగతం....


ఉగాది మరియు
శ్రీరామ నవమి వేడుకలు




Telugu Cultural Association, Austin




Telugu Cultural Association, Austin






Telugu Cultural Association, Austin
ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం


# తెలుగు సాంస్కృతిక సంఘం, ఆస్టిన్











# IMMIGRATION - SEMINAR PHOTOS














Telugu Cultural Association, Austin
DELICIOUS

MY TAX FILER

- Business Formation
- Strategic Tax Planning
- Tax Return Preparation
- Accounting
- Payroll Processing
- FBAR & Foreign Compliance
- IRS Amnesty Programs
- Notice Representation
- Inheritance & Repatriation



Guru C Reddy Dorsala, MBA, EA

All your accounting, payroll and tax needs under one roof – Contact us today for a FREE consultation

Office: 13276 Research Blvd Ste#202, Austin, TX 78750

(512)-766-5829/ austin@mytaxfiler.com

ORGANIC
NATURAL
FRESH
WHOLE WHEAT

Pizza Day

*INTRODUCING*
DELICIOUS INDIAN FLAVORS

Spicy Paneer
Spicy Chicken
Butter Paneer
Butter Chicken
Alfredo Curry Paneer
Alfredo Curry Chicken
Garlic Shrimp

ORDER ONLINE @
WWW.PIZZADAYTX.COM
Call: 512-345-7492 (PIZA)

10225 RESEARCH BLVD #110
GREAT HILLS STATION
AUSTIN, TX, 78759

ALWAYS FRESH, HEALTHY, DELICIOUS

SPICE

FINE INDIAN CUISINE

Austin
500 W Canyon Ridge Drive, #L 275
Austin, Texas- 78753
Ph: 512-432-5727
email: spiceaustintx@gmail.com

San Antonio
4987, NW Loop 410
San Antonio, Texas - 78229
Ph: 210-253-9658
spicefineindiancuisine@gmail.com

http://www.spicefineindiancuisine.com

Authentic Northern & Southern Indian Cuisine,
Daily Lunch Buffet, Zabiha Halal, Catering,
Banquet Hall, Full Bar, Group Discounts.
Anjan/ Madhu

SKYPASS
TRAVEL



**BEST BRAINS**
**LEARNING CENTER**

Austin-Great Hills, TX
12636 Research Blvd Ste C#108
Ph: 512-387-0000

Leander, TX
15609 Ronald Reagan Blvd, D140
Ph: 512-387-0000

Round Rock, TX
2681 Gattis School Road Suite 130
Ph: 512-489-0000

NEW YORK LIFE



**PRAKASH VERMA**
Agent, New York Life Insurance Company
Ph: (512) 731-4010
pverma@ft.newyorklife.com

New York Life Insurance Company
6200 Bridge Point Pkwy Suite 300
Austin, TX 78730



# TCA - రజతోత్సవ చిత్రాలు










అష్టావధానం











'తెలుగువాణి' ఆవిష్కరణ


Best Mortgage Rates! Best Service
low mortgage RATES
ReliTrust MORTGAGE
Funding from internal Sources
Low Cost Purchase Loans!
Conventional / FHA
Zero Cost Refinance
Quick Pre Approval
1-866-735-4441
www.ReliTrust.com
Loan@Relitrust.com
Realtors!
Send us your purchase Loans
Reliability
Trust
Sirish Poondla
972-312-8959

**TRINITY GROUP INC.**

*Integrity and Excellence in Business*

**Real Estate | Investment | Property Mgmt | Travel**



**SIJO VADAKKAN**
GRI, BROKER

595 Round Rock West Drive , # 505 , Round Rock , Texas 78681

Office : 512-279-4596 | Direct : 512-740-2262

Email : info@trinitygroupcompanies.com | www.trinitygroupcompanies.com